క్లుప్తంగా

భూసర్వే వేగవంతం



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మలోల

రాపూరు: మండలంలో జరుగుతున్న భూసర్వేను వేగవంతం చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోల అన్నారు. రాపూరు మండలంలో జరుగుతున్న భూసర్వేను బుధవారం పరిశీలించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ స్థాయిలో భూరీసర్వే జరుగుతుందన్నారు. సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. రైతులు సర్వే అధికారులకు సహకరించి గ్రామాల్లో సర్వే పూర్తి చేయించుకోవాలని సూచించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. తహసీల్దార్ సుభాషిణి పాల్గొన్నారు.

రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలు



మాట్లాడుతున్న వివేక్

పెళ్లకూరు: మూడెకరాల పొలం కలిగిన రైతులందరికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ద్వారా విరివిగా వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తున్నట్లు బుధవారం బ్రాంచ్ మేనేజర్ వివేక్ పేర్కొన్నారు. ట్రాక్టర్లు, రోటవేటర్లు, స్ప్రేయర్లు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల కోసం రైతులు ఫైనాన్స్ కార్పొరేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా బ్యాంక్‌ను సంప్రదించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన మూడు ఎకరాల భూమి కలిగిన రైతులు సంబంధిత పత్రాలను బ్యాంక్‌లో అందించి, కేవలం అడ్వాన్స్ పేమెంట్ చెల్లించిన రెండు రోజులకు రుణం అందజేస్తామన్నారు. రైతులు బ్యాంక్ అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సైదాపురం: పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ దయాకర్ కోరారు. సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనితీరుపై బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సైదాపురం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రక్షాళన చేస్తామన్నారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

వాకాడు: ఈనెల 21న వెంకటగిరిలో నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సభను విజయవంతం చేసేలా పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం




అర్చకులకు విరాళం అందజేస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి నిత్యాన్నదానానికి బుధవారం అమెరికాకు చెందిన రేబాల గోపాలకృష్ణారెడ్డి, ధర్మపత్ని ప్రమీల రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పించారు.

నిబంధనలు తప్పక పాటించాలి

నాయుడుపేటటౌన్: తూనికలు కొలతల శాఖకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ పేర్కొన్నారు. తమ శాఖ బుధవారం డివిజన్ పరిధిలోని గూడూరు, నాయుడుపేట ప్రాంతాల్లో పలు దుకాణాలకు తనిఖీలు చేసినట్లు ఆయన తెలిపారు. నాయుడుపేటలో రెండు బియ్యం విక్రయాలు జరిపే దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుకాణాల్లో తూకం తక్కువగా ఇస్తూ మోసం చేస్తే ఏవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి వస్తువుపై ధరతో పాటు తూకం, తయారు చేసిన తేదీ అనే వివరాలు ఉండాలన్నారు. అదేవిధంగా తూకాలకు వాడే పరికరాలకు కచ్చితంగా ప్రభుత్వ సీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేనివారు తమ శాఖ కార్యాలయం వద్దకు వచ్చి ప్రభుత్వ సీలు వేసుకోవాలని ఆదేశించారు.

19 టన్నుల యూరియా సిద్ధం



యూరియాను పరిశీలిస్తున్న ఏఓ

సైదాపురం: రైతులకు కావాల్సిన ఎరువులు, యూరియాను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామని ఏఓ హైమావతి తెలిపారు. బుధవారం గిద్దలూరు రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉన్న యూరియాను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గిద్దలూరు రైతు భరోసా కేంద్రంలో 19 టన్నుల యూరియా నిల్వ ఉంచామని పేర్కొన్నారు.

శిథిలావస్థలో టూరిజం హోటల్స్

- శిథిలావస్థకు చేరిన ఉడెన్ కాటేజస్
- టీడీపీ హయాంలో కోట్ల రూపాయలు గంగపాలు



నేలపట్టు పక్షుల కేంద్రం మార్గంలో నిర్మించిన హోటల్, ఉడెన్ కాటేజస్

దొరవారిసత్రం: టీడీపీ పాలనలో ప్రజాప్రతినిధులకు ముందు చూపులేకపోవడంతో పాటు టూరిజం శాఖ ఇష్టారాజ్యంగా పనులు ఎక్కడపడితే అక్కడ చేపట్టడంతో అప్పటిలో ఎంతో అందంగా నిర్మించిన హోటల్స్ సముదాయం, ఉడెన్ కాటేజస్, షాపింగ్ కాంప్లెక్స్ వినియోగంలోకి రాకనే నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో కోట్ల రూపాయలు గంగపాలు కాకతప్పలేదు. ప్రస్తుతం ఎందుకు పనికిరాకుండా టూరిజం భవనాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి.

పక్షుల కేంద్ర మార్గమధ్యలో..

నేలపట్టు పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో స్వదేశీ సందర్శయాన్ పథకం (2017–18) కింద రూ.3.18 కోట్లతో వివిధ నిర్మాణాలను టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. కేటాయించిన నిధులతో అప్పుడు రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న పది ఎకరాల అసైన్డ్ భూమిలో ఎంతో చక్కగా ఐదు ఉడెన్ కాటేజస్, అన్ని సదుపాయలతో రెస్టారెంట్, పక్షుల పండుగ సీజన్‌లో సందర్శకుల సౌకర్యార్థం ఓ పెద్ద వాచ్ టవర్, వీటితో పాటు వాహనాలకు పార్కింగ్, అందరిని ఆకట్టుకునేలా పుట్‌పాత్, సోలార్ లైట్లు, బెంచీలు, గ్రీన్ గార్డెన్ వంటివి అందంగా తీర్చిదిద్దారు. కానీ నేటి వరకు ఇందులో ఏదీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిర్మాణాలన్నీ నిరుపయోగంగా మారి క్రమేపి దెబ్బతినడంతో శిథలావస్థకు చేరుకుంటున్నాయి. ఈప్రాంతంలోనే గతంతో పీఆర్ శాఖ(2000–21) వారు రూ.50లక్షలు వెచ్చించి రెండు పెలికాన్ అతిథి గృహాలను నిర్మించారు. ఇవి కూడా వాడుకలోకి రాకనే శిథిలావస్థకు చేరడంతో టూరిజం శాఖ వీటిని స్వాధీనం చేసుకుని స్వదేశీ సందర్శయాన్ పథకానికి చెందిన నిధులు రూ.20లక్షలు వెచ్చించి నాలుగు సూట్ రూమ్‌లగా తీర్చిదిద్ది అన్ని హంగులతో సిద్ధం చేశారు. అయినా ఏలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇవికూడా నిరుపయోగంగా మారాయి.

డీవీ సత్రంలో పున్నమి రెస్టారెంట్..

దొరవారిసత్రం జాతీయ రహదారికి పక్కన, మండల కార్యాలయాలకు ఆనుకుని 2001లో టూరిజం శాఖ కోటి రూపాయల ప్రతిపాదలనతో రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. శాఖాపరంగా రెండేళ్ల పాటు హోటల్‌ను నడిపారు. ఆ శాఖ వల్ల కాకపోవడంతో పలువురు ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్ట్ కింద ఇచ్చారు, కానీ ఏలాంటి మార్పురాలేదు. ఈ టూరిజం సముదాయం అయితే ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. నిర్మాణాలు అంతా దెబ్బతింటున్నాయి.

చెప్పడమే తప్ప ఆచరణ ఎక్కడ...

నేలపట్టు పక్షుల కేంద్రం మార్గం మధ్యలోని టూరిజం సముదాయం, డీవీ సత్రంలోని టూరిజం హోటల్ అన్ని కాంట్రాక్ట్ కింద ఇచ్చేశామని గత ఏడాది నుంచి సంబంధిత టూరిజం అధికారులు చెప్పడమే తప్ప ఎక్కడ కూడా ఆచరణలో కనిపించడంలేదు. కాంట్రాక్ట్ కింద తీసుకున్న వారికి ఈ నిర్మాణాలు అన్ని అనూకూలంగా, ప్రయోజకరంగా లేకపోవడంతో ముందుకు వచ్చిన వారు కూడా వెనక్కి వెళ్లిపోతున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం అదిగో ఇదిగో ప్రాంరంభం అవుతున్నాయని చెప్పడమే కాని ఆచరణలో కనిపించడంలేదు.



మార్గమధ్యలో నిరుపయోగంగా పెలికాన్ అతిథిగృహాలు



దెబ్బతిన్న ఉడెన్ కాటేజస్

ప్రైవేటు వారికి అప్పగించాం



నేలపట్టు పక్షుల కేంద్రం మార్గంలోని టూరిజం సముదాయం, దొరవారిసత్రంలోని టూరిజం హోటల్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ నాలుగు నెలల కిందటే అప్పగించారు. ఏడాదికి అద్దె కింద రూ.5లక్షలు చెల్లిస్తున్నారు. టూరిజం సముదాయం భవనాల్లో హెల్త్ కేర్ సంబంధించినవి ఏర్పాటు చేసి వాడుకోనున్నారు.

– శివారెడ్డి, డీవీఎం, టూరిజం శాఖ, నెల్లూరు

సేవకు వందనం

దొరవారిసత్రం: అది కరోనా విజృంభిస్తున్న రోజులు. మండలం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కరోనాకు గురైన ప్రాంతాలను రెడ్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఆసమయంలో వలంటీర్లు రెడ్‌జోన్ ప్రకటించిన వీధుల్లో, బాధితుల ఇంటి ఆవరణలో బ్లీచింగ్ చల్లి, కరోనా బాధిత ఇళ్లకు శానిటైజేషన్ వలంటీర్లు దగ్గరుండీ చేయించారు. ప్రజలు కరోనాకు గురికాకుండా కృషి చేశారు. నెలబల్లి, వేణుంబాకం, అక్కరపాక, పాళెంపాడు గ్రామాల్లో అధికసంఖ్యలో కరోనా కేసులు నమోదు కావడంతో వలంటీర్లు బాధ్యతగా వీధుల్లో బ్లీచింగ్, శానిటైజేషన్ చేయించారు. కరోనా బాధితుల కుటుంబాలకు అవసరమైన సరుకులు సైతం సమకూర్చి వారియర్స్‌గా నిలిచారు.



నెలబల్లి ఎస్సీ కాలనీలో బ్లీచింగ్ చల్లిస్తున్న వలంటీర్

వలంటీర్ల సేవలు మరవలేం..



నెలబల్లి గ్రామ పరిధిలోని వలంటీర్లు ఎప్పటికప్పుడు ప్రజలకు కరోనాపై అవగాహన కల్పిస్తూ వైరస్‌కు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. కరోనా సోకిన ఇంటి ఆవరణలో క్లోరినేషన్, శానిటైజేషన్‌ను వలంటీర్లు దగ్గరుండీ చేయించారు. లాక్‌డౌన్ సమయంలో వలంటీర్ల సేవలు మరువలేం. – వేణుగోపాల్, నెలబల్లి ఎస్సీ కాలనీ

టీబీ బాధితులకు పౌష్టికాహారం

రాపూరు: వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం టీబీ బాధితులకు పౌష్టికాహార ధాన్యాలను అందించినట్లు వైద్యులు సూర్యధర్మంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 మంది టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని వీరందరికి చికిత్స అందిస్తున్నామని అలాగే ఎనిమిది రకాల పౌష్టికాహార ధాన్యాలను వేపినాపి ఆరోగ్యకేంద్ర సిబ్బంది అందించారని తెలిపారు. వైద్యులు ప్రమీల రాజకుమారి, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పౌష్టికాహార ధాన్యాలు పంపిణీ చేస్తున్న వైద్యులు ప్రమీల రాజకుమారి

వృద్ధుడిపై దాడి

వెంకటగిరిరూరల్: బైక్ రిపేర్ చేసే దుకాణంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆ షాపు యజమానిపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన పట్టణంలోని బంగారుపేటలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు పట్టణంలోని 1వ వార్డు బంగారుపేటకు చెందిన చేశెట్టి విజయకుమార్ 68 ఏళ్ల వృద్ధుడు. ఇతను తన ఇంటిముందు ఉన్న దుకాణాలను అద్దెకు ఇచ్చాడు. ఈ క్రమంలో తన ఇంటిముందు ఒక దుకాణంలో బైక్ రిపేర్ షాప్ కోసం వెంకటగిరి చెందిన ఓ మెకానిక్ తీసుకున్నాడు. ఈ క్రమంలో దుకాణంలో పనిచేసే యువకుడు యజమాని ఇంటికి అడ్డంగా బైక్ పెట్టాడు. బైక్‌ను ఇంటి ముందు నుంచి తీయాలని యజమాని ఆదేశించారు. ఈ క్రమంలో యువకుడికి, యజమానికి వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన యువకుడు విజయకుమార్‌పై దురుసుగా ప్రవర్తించి రాడ్‌తో ముఖంపై దాడి చేసి పరారయ్యాడు. ఆ ఘటనలో యజమానికి పళ్లు ఊడిపోగా, ముఖంలో గాయాలయ్యాయి. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

చిల్లకూరు: ఉపాధి పథకంలో చేపట్టే అవెన్యూ ప్లాంటేషన్‌పై దృష్టిసారించి నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి ఏపీడీ వరప్రసాద్ ఆదేశించారు. పారిచెర్లవారిపాళెంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు సరిగా లేకపోవడంతో త్వరితగతిన వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటించాలని సూచించారు. ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీల మస్టర్లను పరిశీలించారు. ఉపాధి ఏపీఓ గిరి, ఫీల్డ్ అసిస్టెంట్ శేషురెడ్డి ఉన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

గూడూరురూరల్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం గూడూరులో తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్, ద్రౌపదిదేవి కాంప్లెక్స్, నారాయణమ్మ, మాళవ్యానగర్ ప్రాంతాల్లో పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ దాడులు చేసి బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్యాకెట్ల తూకాల్లో వ్యత్యాసం ఉండడాన్ని గుర్తించారు. ఈమేరకు ఆయా దుకాణాలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. దుకాణదారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గూడూరులోని దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న భరత్‌కుమార్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాయుడుపేటటౌన్: మేనకూరు గ్రామ సమీపంలో రహదారి వద్ద బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా మేనకూరు సమీపంలో నాలుగు టన్నుల ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని భీమవరం గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన సలహాలు ఇవ్వాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ నివారణ ఆఫీసర్ డాక్టర్ అరుణసులోచన దేవి తెలిపారు. ఆమె బుధవారం చంద్రగిరి మండలం కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటింటా కుష్ఠు నివారణ కార్యక్రమం సర్వేను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తులు వందశాతం లేకుండా చేయడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రియాంక పాల్గొన్నారు.

రూ.4కోట్లతో సబ్సిడీపై టమాట

- టమాట విక్రయకేంద్రం ప్రారంభించిన మంత్రి కాకాణి



టమాటాలను అందజేస్తున్న మంత్రి కాకాణి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు

గూడూరు రూరల్: స్థానికంగా కొత్తగా ప్రారంభించిన రైతు బజారులో బుధవారం రూ.50లకు టమాటాను సబ్సిడీపై విక్రయించే కేంద్రాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో టమాట ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం గత 15 రోజులుగా రూ.4కోట్లతో సబ్సిడీపై ప్రజలకు కిలో రూ.50కే అందించేలా చర్యలు తీసుకుందని తెలిపారు. సబ్సిడీపై టమాటాలను తీసుకునేందుకు మహిళలు రైతు బజార్ వద్ద బారులు తీరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్‌చక్రవర్తి, మేరిగ మురళీధర్ పాల్గొన్నారు.

ఈ పంట నమోదుకు సాంకేతిక సమస్యను పరిష్కరించండి..

ఈ పంట నమోదులో సాంకేతికపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ వ్యవసాయ సహాయకులు బుధవారం గూడూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు పొలాల్లో నుంచి ఫొటోలు అప్లోడ్ చేసేందుకు గంటల సమయం పడుతోందని, సాంకేతిక సమస్యను పరిష్కరించి పాతపద్ధతిలో ఈ పంట నమోదుకు అవకాశం కల్పించాలని కోరారు.

మంత్రికి ఘనస్వాగతం..

రైతుబజార్ ప్రారంభోత్సవానికి మంత్రి హోదాలో తొలిసారిగా గూడూరుకు విచ్చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బుధవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జాతీయ రహదారి కూడలి వద్ద గజమాలతో మంత్రిని సత్కరించారు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మంజుల, నేతలు కోడూరు మీరారెడ్డి, బత్తిని విజయకుమార్, సతీష్ రెడ్డి, జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, గూడూరు వైస్ ఎంపీపీ మెడనూలు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు ఇనమల్ల శీనయ్య, బల్లి వెంకటేశ్వర్లు, రమణమ్మ, చిట్టేటి నారాయణ, మహేంద్ర యాదవ్, అజీజ్‌ఖాన్, నరసయ్య, అల్తాఫ్, మురళి పాల్గొన్నారు.

సన్మానం



శివసుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు: మండలంలోని వరగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్ఎం శివసుబ్రమణ్యంను బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మరుదవతి పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ

తిరుపతి అర్బన్: అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్‌కు చెందిన వారికి బుధవారం డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, అలిపిరి డిపో మేనేజర్ ఎస్.హరిబాబు అందజేశారు. అలాగే 23వ బ్యాచ్‌లో శిక్షణ పొందేందుకు దరఖాస్తుల పంపిణీని ప్రారంభించారు. తిరుపతి ఎంవీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవర్లకు దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ డిమాండ్ ఉందని చెప్పారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, డిపో మేనేజర్ ఎస్.హరిబాబు మాట్లాడుతూ ఒక్కో బ్యాచ్‌కి 16 మంది చొప్పున 21 బ్యాచ్‌ల్లో 336 మంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వెల్లడించారు. వారిలో 60 శాతం మందికి స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. పలువురు ఆర్టీసీలోను కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు. 22వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 23వ బ్యాచ్‌లో శిక్షణ పొందడానికి దరఖాస్తులు ఇస్తున్నట్లు వెల్లడించారు.



డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న ఎంవీఐ, డీఎం

16 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఆగస్టు 16, 17, 18వ తేదీల్లో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూషణం, కె.భాస్కర్ తెలిపారు. నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం పీడీఎస్‌యూ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు పూనుకుందన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



చంద్రశేఖరపురంలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ దీపిక



చిల్లకూరులో..

కోట: మండలంలోని చంద్రశేఖరపురంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ భవాని, గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి చేతులమీదుగా 827 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కొత్తపట్నంలో జరిగిన జగనన్న సురక్షలో వైస్ ఎంపీపీ శేషయ్య, తహసీల్దార్ పద్మావతి చేతులమీదుగా 760 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బీఎంఆర్ నగర్, బేరిపేట సచివాలయాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎంఆర్ నగర్ సచివాలయానికి సంబంధించి 1,004 మందికి, బేరిపేట సచివాలయంలో 766 మందికి సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, అధికారులు, నాయకులు పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొయిద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అర్బన్ జెసీఎస్ కన్వీనర్, చదలవాడకుమార్, నేతలు కలకం జయరామయ్య, పేట చంద్రారెడ్డి, కళాచంద్ర, ఏ బాబు, సి.వెంకటేశ్వర్లు జరీనా, నస్రీన్, కణ్మని, ఎస్ మోహన్ పాల్గొన్నారు.



మంగళంపాడులో..

చిల్లకూరులో..

చిల్లకూరు: మోమిడి, వరగలి గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఈఓపీఆర్డీ మాణిక్యం, సర్పంచ్‌లు ఈదూరు లావణ్య, బండి మాధవి, ఆయుర్వేద వైద్యులు కె.శేఖర్, పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మంగళంపాడు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్, ఎంపీడీఓ ప్రమీలారాణి, ఏఓ కవిత పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ తేరే కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు వి. మంజుల, సచివాలయ కార్యదర్శి మహేశ్వరి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

ఓజిలి: మండలంలోని అత్తివరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సిరాజ్‌బాషా బుధవారం తెలిపారు. కొత్తచెరువు, అత్తివరం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.